హైదరాబాద్ వార్త



# సమ్మెతో డిపోలకే పరిమితమైన బస్సులు



-ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణీకులు
-ప్రైవేట్ వాహనాల్లో అధిక ఛార్జీల వసూళ్లు
-మెట్రో, ఎంఎంటీఎస్ రైళ్లకు పెరిగిన రద్దీ

జెబిఎస్ ప్లాట్ ఫారాలపై బస్సులు లేక బోసిపోయిన దృశ్యం

**కంటోన్మెంట్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైనందుకు నిరసనగా టీజీఎస్ ఆర్టీసీ జాయింట్‌యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో తలపెట్టిన సమ్మె గురువారం 2వ రోజుకు చేరింది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ రేతిఫైల్ కాంప్లెక్స్, జూబ్లీ బస్టేషన్ ప్రాంతాల్లో సిటీ బస్ సర్వీస్‌లు నడవకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం 5 గంటల నుంచి బస్ సర్వీస్‌లు బయటకు వెళ్లకపోవడంతో వందలాది బస్సులు డిపోలకే పరిమితమైయ్యాయి. కంటోన్మెంట్ డిపోలో 106 ఆర్టీసీ బస్సులు, 2 ప్రైవేట్, బస్సులు ఉన్నాయి. వాటిలో 83 ఈవి ఎలక్ట్రికల్ బస్సులు, రెండు ప్రైవేట్, రెండు ఆర్టీసీ బస్సులను నడిపించినట్లు కంటోన్మెంట్ డిపో మేనేజర్ సుధాకర్ రావ్ తెలిపారు. యాబై శాతం బస్ సర్వీస్‌లను ఆపరేట్ చేసినట్లు డిఎం తెలిపారు. డిపోలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్ వైజర్లు, మెకానిక్‌లతో పాటు మొత్తం 790 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా సమ్మె కారణంగా విధులకు హాజరు కాలేదు. ఆర్టీసీ సెక్యురిటీ, నిఘా విభాగం సిబ్బందితో పాటు డిఎం మాత్రమే విధులు నిర్వహించారు. అదే విధంగా పికెట్ డిపోలో 85 ఆర్టీసీ బస్సులతో పాటు 6 ప్రైవేట్ బస్సులు ఉండగా, 18బస్ సర్వీస్‌లను ఆపరేటీవ్ చేసినట్లు పికెట్ డిఎం రవిందర్ తెలిపారు.



సికింద్రాబాద్ బిజెఎస్ వద్ద ఆందోళన చేస్తున్న ఆర్టీసీ కన్వీనర్ మౌలాన, ఉద్యోగులు

**సమ్మె కారణంగా ప్రయాణికుల ఇబ్బందులు**

ఆర్టీసీ ఉద్యోగులు న్యాయమైన కోర్కెల సాధన కోసం గురువారం తలపెట్టిన సమ్మె 2వ రోజుకు చేరింది. కార్మికుల సమ్మెతో ఆర్టీసి ప్రగతిపద చక్రాలకు బ్రేక్ ఏర్పడింది. గ్రేటర్‌లో 80 శాతం సిటీ బస్సులు డిపోల నుంచి బయటకు రాలేదు. వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదే విధంగా నగరంలో స్థిరపడ్డా ప్రభుత్వ ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు వారి వారి ప్రాంతాల్లో విధులు నిర్వహించేందుకు విధులకు వెళ్లాలంటే బస్ సౌకర్యం లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో విధులు హాజరు కావాల్సిన ఉద్యోగులు ప్రైవేట్ వాహనాలకు అధిక డబ్బులు చెల్లించి వెళ్ళాసి వచ్చింది.

**వెలవెలబోయిన జెబిఎస్**

జెబిఎస్ నుంచి కరీంనగర్, సిద్ధిపేట్, గోదావరిఖని, మంచిర్యాల్, హన్మకొండ, మెదక్, నారాయణ ఖేడ్, జహిరాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్ ప్రాంతాల వైపు వెళ్లాల్సిన బస్సులు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**ఆర్టీసీ సమ్మెతో అటోలకు, క్యాబ్‌లకు పెరిగిన గిరాకి**

ఆర్టీసీ కార్మికులు తలపెట్టిన సమ్మె కారణంతో సిటీలో బస్ సర్వీస్‌లు సక్రమంగా లేక పోవడంతో ప్రయాణికులు అటోలను, క్యాబ్‌లను ఆశ్రయించారు. సాదారణంగా ఆటోలకు 50 నుంచి 100 రూపాయలు, క్యాబ్‌లకు రెండింతల రేట్ల డబ్బులు చెల్లించి గమ్య స్థానాలకు వెళ్ళాస్సి వచ్చింది. అదే విధంగా ప్రైవేట్ వాహనాలతో పాటు సొంత వాహనాల్లో పలువురు ఉద్యోగులు కార్యాలయాలకు పరుగులు తీశారు. మరి కొందరు మెట్రో రైళ్లను ఆశ్రయించారు. దీంతో మెట్రో స్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి.

**సమ్మె కారణంతో మెట్రో వైపు ప్రయాణికులు**

ఆర్టీసీ సమ్మె కారణంతో వివిధ ప్రాంతాల వైపు వెళ్లే ప్రయాణికులు, ఉద్యోగులు మెట్రో రైల్‌లో ప్రయాణించడంతో మెట్రో స్టేషన్లు ప్రయాణికులతో పోటెత్తింది. గురువారం 1.75 లక్షల మంది అదనంగా మెట్రో రైల్‌లో ప్రయాణించి నట్లు హెచ్‌ఎం.ఆర్. అధికారులు తెలిపారు. దీంతో ఆయా మెట్రో స్టేషన్లలోని పికెట్ కౌంటర్ల వద్ద బారీ క్యూలైన్‌లు కనిపించడం జరిగింది.

# అడ్మిషన్స్ ఫర్ సేల్..!

-ముందే మొదలైన డిస్కౌంట్ ఆఫర్
-అప్పుడే కార్పొరేట్ స్కూళ్లలో అడ్మిషన్ల జాతర షురూ
-పరీక్షలు ముగియక ముందే ప్రవేశాల హడావుడి

**హైదరాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

అడ్మిషన్ల జాతర మొదలైంది.. ఆఫర్లు.. డిస్కౌంట్ల పేరుతో తల్లిదండ్రులను బురిడీ కొట్టిస్తూ కార్పొరేట్ పాఠశాలలు బుట్టలో వేసుకుంటున్నాయి. లక్షల రూపాయల ఫీజు చెప్పి.. ఆ తరువాత ఆఫర్ల పేరిట నామమాత్రం తగ్గిస్తూ ప్రవేశాలు కల్పిస్తున్నాయి. కార్పొరేట్ మాయాజాలంలో పడ్డ అమాయక తల్లిదండ్రులు నిలువునా మోసపోతున్నారు. మహానగరంలో విద్యా వ్యాపారం కొత్త పుంతలు తొక్కుతోంది. 10వ తరగతి పరీక్షా ఫలితాలు వెలువడకముందే వచ్చే విద్యా సంవత్సరానికి (2026-27) కార్పొరేట్ పాఠశాలలు అడ్మిషన్ల జాతరను ప్రారంభించాయి. మార్కెటింగ్ అస్త్రంగా మార్చుకుంటూ తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నారు. అప్పుడే విద్యా సంస్థల మధ్య పోటీ పతాక స్థాయికి చేరింది. సాధారణంగా వేసవి సెలవుల్లో మొదలవ్వాల్సిన అడ్మిషన్ల ప్రక్రియ ఈసారి జనవరి నుంచే ముమ్మరమైంది. సిలబస్ పూర్తి కాకముందే సీట్ల వేటలో పడి తల్లిదండ్రులను ఒత్తిడికి గురిచేస్తున్నాయి. కొత్త విద్యా సంవత్సర ప్రారంభం కావడంతో న్యూ ఇయర్ డ్రైవ్ పేరుతో రంగంలోకి దిగిన కొన్ని విద్యా సంస్థలు, ఇపుడు స్పెషల్ డ్రైవ్ అంటూ కొత్త పల్లవి ఎత్తుకున్నాయి. నో డొనేషన్ ఫ్రీ అడ్మిషన్ వంటి ఆకర్షణీయమైన స్లోగన్‌లతో హోరెత్తిస్తున్నాయి. ఇపుడే అడ్మిషన్ పొందితే ట్యూషన్ ఫీజులో 20 శాతం రాయితీ ఇస్తామంటూ బంపర్ ఆఫర్లను ప్రకటిస్తున్నాయి. ఇది విద్యాబోధనలా కాకుండా, ఏదో షాపింగ్ మాల్ సేల్‌ను తలపిస్తోందని విద్యావేత్తలు విమర్శిస్తున్నారు.

**గుర్తింపు లేకున్నా.. ఆగని ప్రచారం**



విద్యాశాఖ నిబంధనలను బేఖాతరు చేస్తూ కొన్ని సంస్థలు చెలరేగిపోతున్నాయి. ఒక విద్యా సంస్థకు అనుమతి లేదని, అందులో ప్రవేశాలు తీసుకోవద్దని ఏకంగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల విద్యాశాఖాధికారులు అధికారికంగా ప్రకటించినప్పటికీ అడ్మిషన్ల ప్రచారంలో మాత్రం తగ్గేదేలే అంటున్నాయి. నగర కూడళ్లలో భారీ హోర్డింగ్లు, ఫ్లెక్సీలు, మెట్రోరైళ్లలో ప్రకటనలు. సోషల్ మీడియా, టీవీ ఛానళ్లలో అడ్మిషన్ల ప్రకటనల వెల్లువ మాత్రం ఆగడం లేదు. నిబంధనల ప్రకారం వార్షిక పరీక్షల ఫలితాలు వెలువడిన అడ్మిషన్లు ప్రారంభించాల్సి ఉంటుంది. ప్రతి పాఠశాల తన రిజిస్ట్రేషన్ నంబర్, గుర్తింపు పత్రాన్ని నోటీసు బోర్డులో ప్రదర్శించాలి. క్యాపిటేషన్ ఫీజు, డొనేషన్లు వసూలు చేయవద్దు, పాఠశాల మేనేజ్‌మెంట్ ఏకపక్షంగా ఫీజులు పెంచకూడదు. పాఠశాల ప్రాంగణంలోనే పుస్తకాలు, యూనిఫాంలు కొనాలని తల్లిదండ్రులను బలవంతం చేయకూడదు. కానీ, ఇందుకు భిన్నంగానే ప్రక్రియ సాగుతోంది.

**ప్రైవేటు వైపే మొగ్గు**

.. గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ప్రైవేటు పాఠశాలల ప్రాబల్యం చాలా ఎక్కువగా ఉంది. దాదాపు 70 శాతం కంటే ఎక్కువ మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లోనే విద్యనభ్యసిస్తున్నారు.
.. 7,451 ప్రైవేటు పాఠశాలలుండగా అందులో 4,550 బడ్జెట్ పాఠశాలలు, 1,900 కార్పొరేట్, వాటి అనుబంధ, 1,001 మిషనరీ పాఠశాలలున్నాయి. కార్పొరేట్ విద్యా సంస్థల ప్రభావంతో సాధారణ, దిగువ మధ్యతరగతి వర్గాలకు అందుబాటులో ఉండే బడ్జెట్ సూకళ్లు తగ్గు ముఖం పట్టాయి... ఇప్పటికే సుమారు 400 పైగా ప్రైవేటు (బడ్జెట్) పాఠశాలలు ఆర్థిక కారణాల వల్ల మూతపడగా, ఆ స్థానాలను కార్పొరేట్ స్కూళ్లు ఆక్రమిస్తున్నాయి.

**తల్లిదండ్రుల్లో అయోమయం**

.. తమ పిల్లల బంగారు భవిష్యత్తు దృష్ట్యా మంచి స్కూల్లో సీటు దొరకదేమోనన్న భయంతో చాలామంది తల్లిదండ్రులు ముందస్తు అడ్మిషన్ల ఉచ్చులో పడుతున్నారు.
.. రాయితీల ఆశతో వేల రూపాయలు అడ్వాన్సు చెల్లిస్తున్నారు. విద్యా సంవ్సత్సరం ప్రారంభమయ్యాక అదనపు ఫీజులు, పుస్తకాలు, యూనిఫామ్స్ పేరుతో స్కూళ్లు అసలు రంగు బయటపెడుతున్నాయని బాధితులు వాపోతున్నారు.

**పట్టని విద్యాశాఖాధికారులు ...**

.. అనుమతులు లేని పాఠశాలలు ప్రచారం చేసుకుంటున్నా, నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వస్తున్నాయి.
.. కేవలం ప్రకటనలు జారీ చేసి చేతులు దులుపుకోకుండా, క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి అక్రమ అడ్మిషన్లను అడ్డుకోవాలని సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.

**మహానగర పరిధిలో ప్రైవేటు స్కూళ్ల వివరాలు**

| జిల్లా పేరు | మొత్తం | బడ్జెట్ స్కూల్స్ | కార్పొరేట్ | ఇంటర్నేషనల్‌మిషనరీ |
|---|---|---|---|---|
| హైదరాబాద్ | 2,885 | 1,800 | 650 | 435 |
| రంగారెడ్డి | 2,711 | 1,650 | 700 | 361 |
| మేడ్చల్ మల్కాజ్‌గిరి | 1,855 | 1,100 | 550 | 205 |

# టార్గెట్లు కాదు.. కస్టమర్ల భద్రతే ముఖ్యం

-బ్యాంకుల్లో 'మ్యూల్ ఖాతాలు' ఉంటే కఠిన చర్యలు
-నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ హెచ్చరిక

**హైదరాబాద్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త**

బ్యాంకు అధికారులు కేవలం ఖాతాల ఓపెనింగ్ టార్గెట్స్ వెంట పడకుండా, కస్టమర్లభద్రతకు పెద్దపీట వేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ సూచించారు. ఒక్క కస్టమర్ కూడా సైబర్ నేరాల బారిన పడకుండా చూడటమే ప్రాథమిక లక్ష్యంగా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బంజారాహిల్స్లోని టీజీఐసీసీసీలో గురువారం మ్యూల్ ఖాతాల నియంత్రణపై బ్యాంకు అధికారులతో ఆయన సమన్వయం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్బీఐ రీజినల్ డైరెక్టర్ చిన్మయ్ కుమార్, అడిషనల్ సీపీ ఎం.శ్రీనివాసులుతో పాటు 45 ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులకు చెందిన 75 మంది ఉన్నతాధికారులు హాజరయ్యారు ఈ సందర్భంగా సీపీ సజ్జనర్ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న మ్యూల్ ఖాతాలను అరికట్టేందుకు 'సేఫ్ కస్టమర్ చాలెంజ్'ను బ్యాంకులు స్వీకరించాలని కోరారు. ఈ క్రమంలో ప్రతి బ్యాంకు శాఖ 'జీరో మ్యూల్ అకౌంట్స్'లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఏ బ్యాంకు శాఖలోనూ సైబర్ బాధితులు ఉండకూడదని, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్)లో నమోదయ్యే ఫిర్యాదుల ఆధారంగా ఆయా బ్రాంచీల పనితీరును అంచనా వేసుకోవాలని స్పష్టం చేశారు. బ్యాంకు మేనేజ్మెంట్లు ఖాతాల సంఖ్యను కాకుండా, కస్టమర్ల భద్రతనే ఉద్యోగుల కీలక పనితీరు సూచికగా పరిగణించాలని హితవు పలికారు. 'ఆపరేషన్ ఆక్టోపస్ 2.0లో భాగంగా 850 కేసుల్లో రూ. 150 కోట్ల మోసాన్ని గుర్తించామని, మ్యూల్ ఖాతాల ఓపెనింగ్ లో సహకరించిన 32 మంది బ్యాంకు అధికారులను అరెస్ట్ చేశామని వెల్లడించారు .కంబోడియా, వియత్నాం, దుబాయ్ వంటి దేశాల నుంచి సాగుతున్న అంతర్జాతీయ సైబర్ ముఠాలు.. స్థానిక బ్యాంకు అధికారులతో కుమ్మక్కై ఈ నేరాలకు పాల్పడుతున్నాయని వివరించారు. కేవైసీ నిబంధనలను ఉల్లంఘించే ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, వారిని బ్యాంకింగ్ రంగం నుంచే బ్లాక్ లిస్ట్ చేయాలని సూచించారు. బ్యాంకుల్లో 'మ్యూల్ ఖాతాలు' ఉంటే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. ముఖ్యంగా ఫిక్స్డ్ డిపాజిట్లను ముందస్తుగా క్లోజ్ చేసేందుకు వచ్చే కస్టమర్ల విషయంలో బ్యాంకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్ల ఒత్తిడితోనే వారు డబ్బు విత్‌అ చేస్తున్నారా? అన్నది గమనించి వారిని కాపాడాలని కోరారు. మ్యూల్ ఖాతాలను గుర్తించేందుకు 'మ్యూల్ హంటర్' వంటి ఆధునిక సాంకేతిక పరికరాలను వాడాలని, 1930 హెల్ప్ లైన్ నంబర్‌పై కస్టమర్లకు విస్తృత అవగాహన కల్పించాలని బ్యాంకర్లకు సూచించారు. సైబర్ నేరగాళ్ల నెట్వర్కు పూర్తిగా తుడిచిపెట్టే వరకు ఆపరేషన్ ఆక్టోపస్ కొనసాగుతుందని, బ్యాంకులు పోలీసులతో సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు.

ఈ సమావేశంలో సైబర్ క్రైమ్స్ డీసీపీ అరవింద్ బాబు, ఏసీపీ శివమారుతి, బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.



డిజిపి హోదాకు పదోన్నతి పొందిన సందర్భంగా కుటుంబ సభ్యుల సమక్షంలో బాధ్యతలు స్వీకరిస్తున్న సిపి విసి సజ్జనార్

## కబ్జాల నివారణకు ముందస్తు చర్యలు

**దొమ్మరపోచంపల్లిలో ప్రభుత్వ భూమికి హైడ్రా ఫెన్సింగ్**

**దుండిగల్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గండి మైసమ్మ, దుండిగల్ మండలం పరిధిలోని దొమ్మరపోచంపల్లి గ్రామంలో ప్రభుత్వ భూములను కాపాడేందుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. సర్వే నంబర్లు 120/1, 120/28లో ఉన్న సుమారు 8 ఎకరాల ప్రభుత్వ స్థలానికి గురువారం చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రక్షణ కల్పించారు. ఇటీవలి కాలంలో నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్న నేపథ్యంలో, ముందస్తు చర్యగా ఖాళీగా ఉన్న భూములను గుర్తించి ఫెన్సింగ్ వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. భూములపై అక్రమ నిర్మాణాలు, ప్లాట్లుగా విభజించి విక్రయాలు జరగకుండా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా, సంబంధిత రెవెన్యూ అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే స్పందించేందుకు ప్రత్యేక బృందాలను కూడా ఏర్పాటు చేసినట్లు సమాచారం. ప్రభుత్వ భూములను పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.



ఫెన్సింగ్ వేస్తున్న దృశ్యం

## భవనంపై నుండి పడి కార్మికుడు మృతి

**అత్తాపూర్ ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** భవనంపై నుండి ప్రమాదావ శాత్తు కార్మికుడు పడి మృతి చెందిన విషాద ఘటన రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని అత్తాపూర్ గోల్డెన్ హైట్స్‌లో చోటుచేసు కుంది. పోలీసుల వివరాల ప్రకారం... అత్తాపూర్ గోల్డెన్ హైట్స్‌లో ఓ అపార్ట్‌మెంట్స్‌లో నిర్మాణ పనులు చేస్తుండగా ఉత్తరప్రదేశ్‌కు చెం దిన కార్మికుడు చందన్ చౌధరి (19) ప్రమాదవశాత్తు 6వ అంతస్తు నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని వెంటనే సమీపం లోని ఆల్ఫా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## పివిఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వేపై యాక్సిడెంట్

**అత్తాపూర్ ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ పివిఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే పై యాక్సిడెంట్ అయింది. పిలర్ నం. 241 వద్ద వేగం గా వెళ్తున్న కారు అదుపు తప్పి ఒక రోడ్డుపై నుంచి మరో రోడ్డుపైకి ఎగిరి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో కొంతమంది యువకులు తీవ్రంగా గాయపడ్డారు. అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. గాయపడిన వారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బాచుపల్లిలో దొంగల ముఠా అరెస్ట్

**కొంపల్లి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

రాత్రిపూట నివాస గృహాల తాళాలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను బాచుపల్లి క్రైమ్ టీమ్ అరెస్ట్ చేసింది. డీఐ ఎన్. సురేష్ తెలిపిన వివరాల ప్రకారం ప్రకాష్ నగర్, కూకట్‌పల్లికు చెందిన నెమలి డేవిడ్ రాజ్ వరుణ్ (19), మరో నిందితుడు సప్తగిరి కాలనీ, కూకట్‌పల్లికి చెందిన ఆరె సాయి ఆదిత్య (21) రాత్రిపూట నివాస గృహాల తాళాలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్నారని తెలిపారు. వీరిద్దరూ గతంలో కూడా రాత్రిపూట ఇళ్లలో తాళాలు పగలగొట్టి దొంగతనాలు చేసిన మూడు కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు విచారణలో బయటపడింది. నిందితుల వద్ద నుండి సుమారు 30 గ్రాముల బంగారం, సిల్వర్ పట్టీలు, ఒక డియో స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. కేసును నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన బాచుపల్లి క్రైమ్ టీమ్ నిందితులను పట్టుకుని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించింది. ఈ కేసును ఛేదించడంలో హెడ్ కానిస్టేబుల్ ఆనందరెడ్డి, పీసీలు రాజు, శ్రీనివాస్, నిరంజన్, సతీష్, కనకయ్యలు కీలక పాత్ర పోషించగా, ఉన్నతాధికారులు వారిని అభినందించారు.

## జిఎస్టీ సర్కిళ్ల మార్పులపై తర్జబర్జనలు

**గోషామహల్, ఏప్రిల్ 23ప్రభాతవార్త:** వాణిజ్య పన్నుల శాఖ(జిఎస్టీ)సర్కిళ్ల కార్యాలయాల మార్పుపై తర్జన భర్జన నెలకొంది. జిహెచ్‌ఎంసి 60 సర్కిళ్ల తరహాలోనే జీఎస్టీ కార్యాలయాలు కూడా ఏర్పాటు చేయాలని ఆ శాఖ అధికారులు, ఉన్నతాధికారులకు ఇటీవల విన్నవించారు. ఈ నెల 30వ లోపు జీఎస్టీ సర్కిల్ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు సైతం జారీ చేసినట్లు తెలిసింది. దీంతో సర్కిళ్ల మార్పుపై ఎలాంటి స్పష్టత లేకపోవడంతో డప్యూటి కమీషనర్‌స్థాయి అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అత్యధికంగా జీఎస్టీ వసూలు అయ్యే జిల్లా హైదరాబాద్, గ్రేటర్‌లో ఈ శాఖకు 78 సర్కిల్ కార్యాలయాలు ఉన్నాయి. జిహెచ్‌ఎంసికి 60 సర్కిల్ కార్యాలయాలు మాత్రమేఏ ఉన్నాయి. 78 సర్కిళ్లను 60 సర్కిళ్లుగా చేయాలంటే రెవెన్యూ వసూళ్లలో తీవ్ర గందర గోళం ఏర్పడుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా జిహెచ్‌ఎంసి కేవలం గ్రేటర్ పరిధిలో ఉండగా పన్నులశాఖ గ్రేటర్‌తోపాటు రాష్ట్ర నలుమూలలా విధి విధానాలు పన్నుల వసూళ్లు ఉంటాయి. జిహెచ్‌ఎంసి తరహాలో వాణిజ్య పన్నుల సర్కిళ్ల కార్యాలయాలు రూపొందిస్తే జీఎస్టీ విభాగానికి నష్టమే తప్ప ఎలాంటి లాభాలు ఉండవని అధికారులు, ఉద్యోగులు అంటున్నారు. రాష్ట్ర ఆదాయానికి గుండెకాయ లాంటి జీఎస్టీ విభాగాన్ని జిహెచ్‌ఎంసితో పోల్చడం సబబు కాదని పేర్కొంటున్నారు. ప్రతినెల జీఎస్టీ నుంచి ప్రతినెల 5వేల కోట్ల రెవెన్యూ వస్తుండగా, అందులోన సగ భాగం గ్రేటర్ హైదరాబాద్ నుంచి వసూళ్లు అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. పెద్ద ఎత్తున్న వేల కోట్లరెవెన్యూ ఇచ్చే జీఎస్టీ సర్కిలన కార్యాలయాలు జిహెచ్‌ఎంసి తరహాలో విభజించడేమేంటని పశ్నిస్తున్నారు. జిహెచ్‌ఎంసి తరహాలో చేయాలనుకుంటే మరో 5 నెలల నుంచి 6 నెలల సమయం కావాలని అప్పుడే పకడ్బందీగా మార్పులు జరిగే అవకాశం ఉంటుంది. ప్రభుత్వానికి మరింత ఆదాయం పెరిగే అవకాశాలు ఉంటాయన్నారు. తొందరపాటు చర్య వల్ల అటు వ్యాపారులు, ఇటు ఈ శాఖ అధికారులు ఇబ్బందుల పాలయ్యే అవకాశాలు ఉంటాయన్నారు.

## శోభిల్లుతున్న తెలంగాణ ప్రజాకళలు

**రవీంద్రభారతి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :**

రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో రవీంద్ర భారతి ప్రాంగణంలోని పాల్కురికి సోమన్న వేదికలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ ప్రజా కళ పేరిట 99 రోజుల సాంస్కృతిక ఉత్సవాల్లో గత మూడువారాలు జరుగుతున్న వివిధ కళారూపాల అద్భుత ప్రదర్శనలు విచ్చేస్తున్న అశేష ప్రేక్షకులను అలరిస్తూ మంత్రము గ్ధలను చేస్తున్నాయి. ఇందులో భాగంగా శ్రీభక్త రామదాసు ప్రభుత్వ సంగీత నృత్యకళాశా ల, డా. దేవులపల్లి ప్రశాంత్ శిష్యబృందంచే కూచిపూడి నృత్యం, వసంత్‌కుమార్‌చే మ్యా జిక్ (ఇంద్రజాల) ప్రదర్శన, అశోక్‌చే మిమిక్రీ, వెంట్రిలాక్విజం ప్రదర్శన, కరుణాకర్ మైమ్ తదితర సాంస్కృతిక ప్రదర్శనలు రంజింపజేశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి విశిష్ట అతిథులు ఫీల్డ్ ఆఫీసర్ నరసింహులు, తెలంగాణ సాంస్కృతిక సారథి ఆడ్మినిస్ట్రేటివ్ ఆఫీస ర్ డా. విజయ్‌కుమార్, సూపరింటెండెంట్ ప్రసా ద్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, మం డలి సలహాదారులు నర్సింహ్మ, వ్యాఖ్యాత విద్యానందాచారి తదితరులతో కలిసి ఈనాటి ప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారులను ఘనంగా సత్కరించారు.





తెలంగాణ ప్రజాకళ ప్రదర్శనల్లోని దృశ్యాలు

## జనగణన శిక్షణ కేంద్రాన్ని పరిశీలించిన జిహెచ్‌ఎంసి కమిషనర్

**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 23, ప్రభాతవార్తః**

బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూమ్ కాలేజీలో ఏర్పాటు చేసిన జనగణన శిక్షణ కేంద్రాన్ని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ పరిశీలించారు. జూబ్లీహిల్స్ సర్కిల్ 36 పరిధికి సంబంధించిన సందర్భంగా కమిషనర్ శిక్షణ ఏర్పాట్లు, సౌకర్యాలు, అలాగే జనగణన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు తీసుకున్న చర్యలను సమీక్షించారు. అధికారులు, శిక్షణ పొందుతున్న సిబ్బందితో ఆయన ప్రత్యక్షంగా మాట్లాడి, డేటా సేకరణలో ఖచ్చితత్వం, సమన్వయం, సమయపాలన అత్యంత కీలకమని సూచించారు. అదేవిధంగా, జనగణ న కార్యక్రమం నిరంతరాయంగా సాగేందుకు అవసరమైన అన్ని వసతులు, లాజి స్టిక్ మద్దతు సమకూర్చాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.



జనగణన శిక్షణ కేంద్రంలో ఆర్.వి. కర్ణన్.

## చారిత్రక చార్మినార్‌ను తిలకించిన ఆదివాసీలు



**చార్మినార్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :** చారిత్రక చార్మినార్‌ను గురువారం ఆదివాసీలు సందర్శించారు. ఆదివాసీలకు రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులు మంగళ వాయిద్యాల నడుమ సాదారంగా ఆహ్వానం పలికారు. రాష్ట్రంలోని ఉట్నూరు ప్రాంతానికి చెందిన ఆదివాసీలు చార్మినార్ అందాలు చూసి ఎంతో అనుభూతికి లోనయ్యారు. టూరిజం అధికారులు ఆదివాసీల బృందానికి చార్మినార్ విశిష్టత గురించి వివరించారు. చార్మినార్ వద్ద ఆదివాసీలు విదేశీ పర్యాటకులతో కలిసి చిరునవ్వులు చిందిస్తూ ఫోటోలు దిగుతూ జ్ఞాపకాలుగా నిలుపుకున్నారు. చార్మినార్ ఎంతో అద్భుతంగా ఉందని ఆదివాసీల బృందం తెలిపింది.

## చిక్కడపల్లిలో చుక్కలు చూపుతున్న మంచినీటి కష్టాలు

**పైపులైన్ పరిమాణం తగ్గింపుతో తీవ్ర అల్లాడుతున్న జనం**

**చిక్కడపల్లి, ఏప్రిల్ 23 (ప్రభాతవార్త ) :** చిక్కడపల్లి పరిధిలోని బాగ్ లింగంపల్లి సెక్షన్ పరిధిలో మంచినీటి సరఫరా సమస్య జటిలమవుతోంది. జలమండలి అధికారుల అనాలోచిత నిర్ణయాల వల్ల వేసవి కాలంలో స్థానికులు నీటి కోసం అల్లాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆర్టీసీ క్రాస్ రోడ్స్ నుంచి చిక్కడపల్లికి వచ్చే ప్రధాన మంచినీటి పైపులైన్ సామర్థ్యాన్ని కుదించడమే ఈ సమస్యకు మూలకారణమని స్థానికులు మండపడుతున్నారు. గతంలో ఈ ప్రాంతానికి 18 అంగుళాల వ్యాసం కలిగిన ప్రధాన సరఫరా పైపులైన్ ఉండేది. అయితే, ఇటీవల పనుల పేరుతో ఆ పైపును కట్ చేసి, దాని స్థానంలో చిన్న పైపును ఏర్పాటు చేశారు. దీని ద్వారానే ప్రస్తుతం చిక్కడపల్లి, బాగ్ లింగంపల్లి ప్రాంతాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. పైపులైన్ పరిమాణం తగ్గడంతో నీటి ప్రెషర్ భారీగా తగ్గిపోయింది. ఫలితంగా బస్తీల్లోని చివరి ఇళ్లకు అసలు నీరు అందడం లేదు. వచ్చిన కొద్దిపాటి నీరు కూడా తక్కువ ఒత్తిడితో వస్తుండటంతో గృహ అవసరాలకు సరిపోవడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని ఇతర సెక్షన్లలో నీటి సరఫరా యథావిధిగా సాగుతున్నా, కేవలం చిక్కడపల్లి సెక్షన్‌లోనే ఇలాంటి కృత్రిమ కొరతను సృష్టించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎండలు ముదురుతున్న తరుణంలో నీటి వాడకం పెరుగుతుందని, ఇలాంటి సమయంలో పైపుల పరిమాణం తగ్గించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. గతంలో నీటి సమస్య ఉండేది కాదు. పైపులైన్ మార్చినప్పటి నుంచే ఈ కష్టాలు మొదలయ్యాయి. అధికారులు వెంటనే స్పందించి పాత పైపులైన్ తరహాలోనే పూర్తిస్థాయిలో నీటి సరఫరా పునరుద్ధరించాలి. ఈ సమస్యపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించాలని బాధితులు కోరుతున్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు రోడ్ల మీదకు రాకముందే శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు.

## కుంభ ప్రోక్షణ కార్యక్రమానికి గవర్నర్‌కు ఎమ్మెల్యే ఆహ్వానం


గవర్నర్‌కు ఆహ్వానాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే మాధవరం

**కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**
కూకట్‌పల్లి రామాలయం వద్ద మే 1వ తేదీన జరిగే కుంభ ప్రోక్షణ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లని గురువారం రాజ్ భవన్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆయన తనయుడు మాధవరం సందీప్ రావు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, రాజేశ్వర రావు పాల్గొన్నారు.

## మంత్రి జూపల్లి కృష్ణారావుతో సత్యం శ్రీరంగం భేటీ


మంత్రి జూపల్లి కృష్ణారావుతో మాట్లాడుతున్న సత్యం శ్రీరంగం

**కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**
రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్, సాంస్కృతిక పురావస్తు శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావుతో తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం కలిసి గురువారం సమావేశమయ్యారు.టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్‌ల ఆదేశాల మేరకు సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కొల్లాపూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా నియమించినందుకు కొల్లాపూర్ నియోజకవర్గంలోని గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీలలో కమిటీల గురించి సచివాలయంలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావుని పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం కలిసి చర్చించారు.

## భవాని శివ శంకర స్వామి దేవాలయ ద్వితీయ పుష్కర వార్షిక బ్రహ్మోత్సవాలు


బండి రమేష్‌ను సత్కరించిన కమిటీ సభ్యులు

**కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**
కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని వివేకానంద నగర్‌లో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి శ్రీ భవాని శివ శంకర స్వామి వారి దేవాలయ ద్వితీయ పుష్కర వార్షిక బ్రహ్మోత్సవాలు గత మూడు రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి దేవాలయ కమిటీ ఆహ్వానం మేరకు టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ వారు ఈ సందర్భంగా బండి రమేష్‌ని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈనెల 26న బ్రహ్మంగారి ఆరాధన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గాలి బాలాజీ, తూము వేణు, కొప్పిశెట్టి దినేష్ కుమార్, గంధం రాజు, మస్తాన్ రెడ్డి,రంగా మోహన్, కనకయ్య, బాలరాజు, కృష్ణమూర్తి, గోపాల్ రెడ్డి, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

## 26న దాస హనుమాన్ పునః ప్రతిష్ఠాపన

**చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** పాతబస్తీ లాల్‌దర్వాజా వెంకట్రావు స్కూల్ సమీపంలోని శ్రీ దత్తాత్రేయ స్వామి మందిరం (పెద్ద)లో ఈనెల 26వ తేదీ ఆదివారం శ్రీ దాస హనుమాన్ పునః విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆ ఆలయ నిర్వాహకులు పి.దత్తప్రసాద్ తెలిపారు. ఉదయం 8.45గంటలు పునః ప్రతిష్ఠాపన ఉత్సవాలు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలతో ప్రారంభమై స్వామి వారికి విశేష పూజలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 12.05 గంటలకు శ్రీ సీతారాముల కల్యాణోత్సవం ఉంటుందన్నారు. అనంతరం భక్తులకు మహా ప్రసాద వితరణ చేపట్టనున్నట్లు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై హనుమత్ సమేత శ్రీ సీతారామలక్ష్మణుల అనుగ్రహానికి పాత్రులు కాగలరని పేర్కొన్నారు.

## వంట గదుల ఆధారంగా కుటుంబాల నిర్ధారణ


ఎన్యూమరేటర్లకు జనగణన కిట్లను అందజేస్తున్న ఎవిహెచ్‌ఎం సులేమాన్

**చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** జాతీయ స్థాయిలో ప్రారంభం కానున్న జనగణన (206-27)లో తొలి విడతలో భాగంగా ఇల్లు, కుటుంబాల సంఖ్యను లెక్కించనున్నట్లు ఎవిహెచ్‌ఎం సులామేన్ తెలిపారు. జనగణన శిక్షణలో భాగంగా సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్ల మొదటి బ్యాచ్ మూడు రోజుల శిక్షణా తరగతులు పూర్తైన సందర్భంగా వారికి కిట్లను అందజేశారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సారి ఆన్‌లైన్ విధానంలో జనగణన చేపడుతున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం ఎన్యూమరేటర్ల మొబైల్‌లోని ప్రత్యేక యాప్‌లో కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయాలన్నారు.ఒక్కో కుటుంబ వివరాల కోసం దాదాపు 15 నిమిషాల సమయం పడుతుందన్నారు. అయితే కుటుంబాల సంఖ్యను ఆ ఇంట్లో గల వంట గదుల ఆధారంగా నిర్ణయించనున్నారు.కార్యక్రమంలో ఎఇ కుమార్ నాయక్,శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్,సిబ్బంది నర్సింగ్‌రావు,కుమార్,ఉపాధ్యాయ సంఘాల నేతలు మండడివెంకట్‌రెడ్డి,ప్రద్యుమ్నారెడ్డి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పూల్‌బాగ్‌లో టౌన్ వెండింగ్ కమిటీ సమావేశం


చాంద్రాయణగుట్టలో ఫుట్‌పాత్ వ్యాపారుల వివరాలను సేకరిస్తున్న జీహెచ్‌ఎంసి, ట్రాఫిక్ అధికారులు

**చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** జీహెచ్‌ఎంసి చాంద్రాయణగుట్ట, జంగమ్మెట్ సర్కిళ్ల టౌన్ వెండింగ్ కమిటీ (టివిసి) సమావేశం గురువారం నర్కిపూల్ బాగ్‌లో జరిగింది. ఆయా సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు వి.సురేందర్, పి.పాపయ్య, ప్రాజెక్ట్ ఆఫీసర్ వై.కురుణాకర్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సుధాకర్, చాంద్రాయణగుట్ట, సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు ఎం.దాసు, మొహమ్మద్ ఆసీఫ్, వీధి వ్యాపారుల కమిటీ ప్రతినిధులు పాల్గొని పలు విషయాలపై చర్చించారు. వ్యాపారుల ఇబ్బందులను టివిసి ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అయితే వీధి వ్యాపారులు రోడ్లను కబ్జా చేసి వ్యాపారాలు చేయటం వల్ల పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని గుర్తించారు. అనంతరం చాంద్రాయణగుట్ట పైవంతెన ప్రాంతంలో రోడ్లను, ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకొని వ్యాపారాలు చేస్తున్న వారి వివరాలను సేకరించారు. ఎనిమిది మంది వ్యాపారులకు పునరావసం కల్పించాలని నిర్ణయించారు.

## గంగను దివి నుండి భువికి తీసుకువచ్చిన మహనీయుడు భగీరథ మహర్షి

-పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ


సగర భగీరథ జయంతి వేడుకల్లో పాల్గొన్న

**కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**
కార్యదక్షత, కఠోరదీక్ష, సడలని ఆత్మ విశ్వాసం, సాధించే దాకా చేసే అలుపెరుగని పోరాటం శ్రీశ్రీశ్రీ భగీరథ మహర్షి మహనీయునికి ఆభరణాలనీ పిఎసి చైర్మన్ శేర్లింగంపల్లి శాసనసభ్యులు అరికెపూడి గాంధీ అన్నారు. గురువారం జగద్గిరిగుట్ట షిరిడి హిల్స్ సగర సంగం కార్యాలయంలో జరిగిన శ్రీశ్రీశ్రీ భగీరథ జయంతి వేడుకల్లో పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ, కుత్బుల్లాపూర్ శాసన సభ్యులు వివేకానంద గౌడ్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ కొనుకుల జగన్ ముఖ్యఅతిథిగా పాల్గొని భగీరథ మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ నాటి కృతయుగం నుండి నేటి కలియుగం వరకు కార్యసాధకుడిగా చరిత్ర పుటల్లో వాసికెక్కి ఎందరికో ప్రతిరూపంగా నిలిచిన శ్రీశ్రీశ్రీ సగర భగీరథ మహర్షి యావత్తు సగర జాతికి కుల గురువు కావడం విశేషం అన్నారు. ప్రతి ఏటా ఆ మహనీయుని జయంతిని ఘనంగా జరుపుకొని మనసారా స్మరించుకోవడం అభినందనీయం అన్నారు. షట్ చక్రవర్తుల్లో ఒకరైన సగర చక్రవర్తి వంశానికి చెందిన సగర భగీరథుడు పూర్వీకుల (తాతల) పునర్జీవితానికై కఠోర యజ్ఞతపస్సును చేశారు. ఓ ముని శాపం కారణంగా గుట్టలుగా పడి ఉన్న పూర్వీకుల పార్థివదేహ భస్మీపటలంపై ఆ పరమ శివుడి జటాజూటం నుండి వెలువడే గంగను పార్థిస్తే శాప విముక్తి గావిస్తారని తెలిసి ఆ నీలకంఠుడి కోసం ఒంటి కాలుపై నిల్చొని కఠోర తపస్సు చేసి చివరికి పరమ శివుణ్ణి మెప్పించి దివి నుండి భువికి గంగమ్మను తీసుకువచ్చి 60 వేల మంది సగరులను విముక్తుల్ని చేసి కొత్త జీవితాన్ని అందించిన ధీరోదాత్తుడు శ్రీశ్రీశ్రీ సగర భగీరథ మహర్షి అని అన్నారు. అంతేకాకుండా సర్వ జీవులకు ప్రాణాధారమైన గంగమ్మను అందించిన శ్రీశ్రీశ్రీ సగర భగీరథ మహర్షి జయంతి యావత్తు జాతి స్మరించుకునే విధంగా అత్యంత ఘనంగా ప్రభుత్వం అధికారికంగా జయంతి వేడుకలు నిర్వహించడం గర్వకారణం అన్నారు. సగర సంగం అధ్యక్షులు వేముల సుదర్శన్ సాగర్ ప్రధాన కార్యదర్శి ఎం ఎస్. భీమయ్య సాగర్ కోశాధికారి ఎం. వెంకటరమణ సాగర్ ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట సగర సంఘం సగర మహిళా సంఘం సగర యువజన సంఘం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## తెలంగాణకు కాళేశ్వరం వరప్రదాయిని : బిఆర్ఎస్


మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

**దుండిగల్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** తెలంగాణకు కాళేశ్వరం ప్రాజెక్టు వరప్రదాయినిగా నిలిచిందని, ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న విమర్శలు భూటకపు మాటలేనని బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ కృష్ణ, సంజీవ్ రెడ్డి పేర్కొన్నారు.తన తపోశక్తితో గంగమ్మను భూమిపైకి తీసుకువచ్చిన భగీరథుడిలా, తన దార్శనికతతో గోదావరి జలాలను వినియోగించి తెలంగాణను సస్యశ్యామలం చేసిన అపర భగీరథుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని కొనియాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రాష్ట్ర వ్యవసాయ రంగం బలోపేతమైందని, రైతులకు నీరందించి పంటల ఉత్పత్తి పెరిగిందని తెలిపారు.తెలంగాణ తలసరి ఆదాయాన్ని దేశ సగటుతో పోలిస్తే గణనీయంగా పెంచడంలో కేసీఆర్ కీలక పాత్ర పోషించారని అన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత ఆయనకే చెందుతుందని అన్నారు.అధికారంలోకి రావడమే లక్ష్యంగా ప్రజలకు తప్పుడు ప్రచారం చేసి, కాళేశ్వరం ప్రాజెక్టును విమర్శిస్తున్న ప్రభుత్వం కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. పీసీ ఘోష్ కమిటీ పేరుతో రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుంటోందని ఆరోపించారు.కమిషన్ల పేరుతో ప్రజలను, న్యాయస్థానాలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్న ప్రభుత్వానికి హైకోర్టు తీరు గుణపాఠమని పేర్కొన్నారు. ఇకనైనా ప్రభుత్వం కక్ష రాజకీయాలను పక్కనబెట్టి ప్రజా పాలనపై దృష్టి సారించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటేష్ యాదవ్, తాజా మాజీ కౌన్సిలర్లు సాయి, మురళి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## 25న లష్కర్ వీధులలో అమ్మవారి శోభాయాత్ర,రథోత్సవం

-రెండు రోజుల పాటు శ్రీవాసవీ అమ్మ వారి జయంతి వేడుకలు

**బేగంపేట ఏప్రిల్ 23,ప్రభాతవార్త**
ఆర్యవైశ్యుల ఇలవేల్పు ఆరాధ్యదైవం శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మ వారి జయంతి వేడుకలను రెండు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు సికింద్రాబాద్ ఆవుల మంద శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవస్థానం కమిటీ సభ్యులు ,ఉత్సవ కమిటీ సభ్యులు తెలియజేసారు.గురువారం ప్యారడైజ్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నార్ల దీపక్ ,దేవస్థానం కమిటీ అధ్యక్షుడు చందా బాలేందర్,ప్రధాన కార్యదర్శి తమ్మి వెంకటేశం, శరత్, కోశాధికారి గంపా వినోభా,దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ సోమా ఆనంద్ తదితరులు మాట్లాడి వివరాలు వెల్లడించారు.అమ్మ వారి జయంతి వేడుకలను అత్యంత వైభవంగా ఈ ఏడాది పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు.ఈ నెల 25వ తేదీన ఉదయం గం 7.30నిలకు దేవాలయంలో హోమం నిర్వహిస్తున్నామన్నారు.అనంతరం తీర్థ ప్రసాదాల వితరణ ఉంటుందన్నారు.సాయంత్రం గం 4లకు అమ్మ వారి రథయాత్ర ప్రారంభమవుతుందన్నారు.ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాలైన పూలతో అందంగా అలంకరించనున్నట్లు వారు తెలియజేసారు.విద్యుత్ కాంతులతో బగ్గీపైన అమ్మ వారి ఊరేగింపు 102మంది మహిళలతో కలశాలతో ఊరేగింపు నిర్వహించిన అనంతరం అమ్మ వారికి అభిషేకం జరుగుతుందన్నారు.102మంది మహిళలతో కోలాటం వివిధ దేవుళ్ల అలంకరణలతో వేషధారణలతో కేరళ వాయిద్య బృందం ప్రదర్శన మహారాష్ట్రబ్యాండ్ ప్రదర్శన,పూలు,విద్యుత్ కాంతులతో సికింద్రాబాద్ పురవీధులలో అంగరంగ వైభంగా అమ్మ వారి శోభాయాత్ర, రథయాత్ర జరుగుతాయన్నారు.వేడుకలకు వచ్చే భక్తులకు పెనుగొండలో 11రోజుల పాటు పూజించిన నాణేలను ముగ్గురు ప్రముఖ గురువుతలతో భక్తులకు వితరణ చేయనున్నామని వారు తెలియజేసారు.26వ తేదీన ఉదయం గం 6లకు శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మ వారి దేవాలయంలో అభిషేకంతో అమ్మ వారి జయంతి పూజలు ప్రారంభమవుతాయని 11లకు లక్ష పుష్పార్చన,గం 11.30నిలకు సామూహిక కుంకుమార్చన,మధ్యాహ్నం ఒంటి గంటకు మహాహారతి,అనంతరం తీర్థ ప్రసాదాలు, సాయంత్రం గం 7లకు భజన,దీపోత్సవం జరుగుతాయన్నారు.అమ్మ వారి జయంతి ఉత్సవ కమిటీ సంయుక్త కార్యదర్శి మాశెట్టి శ్రీనివాస్ పీఆర్వో తెలుకుంట పూర్ణచందర్,కోచైర్మన్లు చొల్లేటి సుభోద్‌గుప్తా,కట్ట శ్రీనివాస్‌గుప్తా, తడక వెంకటేష్,మహంకాళీ ఉమామహేశ్వర్,తేరాల శ్రీనివాస్,నాగిళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నిమ్స్‌కు ఎయిర్ కూలర్ల వితరణ


ఎయిర్ కూలర్లు అందించిన హనుమంతు నాయుడు, చిత్రంలో నగరి బీరప్ప తదితరులు.

**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 23, ప్రభాతవార్తః**
నిమ్స్ ఆసుపత్రికి ప్రముక న్యాయవాది లయన్ చేకూరు హనుమంతు నాయుడు ఎయిర్ కూలర్లను విరాళంగా అందించారు. రూ. 1.5లక్షల విలువైన పది కూలర్లను ఆయన నిమ్స్ డైరక్టర్ నగరి బీరప్పకు నిమ్స్ ప్రాంగణంలో అందించారు. ఈ సందర్భంగా హనుమంతు నాయుడు మాట్లాడుతూ పదేళ్లుగాద ఏసవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, రోగులకు వేసవి నేపథ్యంలో ఉపశమనం కల్పించేందుకు వీటిని అందించామన్నారు. భవిష్యత్తులో రోగుల సంక్షేమానికి మరిన్ని కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ సందర్భంగా దాతను నగరి బీరప్ప అభినందించారు. కార్యక్రమంలో లయన్ డేవిడ్‌రాజు, అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్, మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్యగౌడ్, ఆర్‌ఎంఒ పాల్గొన్నారు.

## ఘనంగా వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం


స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే తలసాని

**సంజీవరెడ్డి నగర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
సంజీవరెడ్డి నగర్ పరిధిలోని ఎస్సార్ నగర్‌లో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించబడింది. ఈ వేడుకలకు మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆయనను సన్మానించి ఆశీర్వాదాలు అందించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, ఆలయ చైర్మన్ బొడ్డు కుమార్, ఈఓ నరేందర్ రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, కరుణాకర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, కూతురు నర్సింహ, కట్టా బలరాం, పీయూష్ గుప్తా, సీనియర్ సిటిజన్ పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలు


భగీరథ మహర్షి జయంతి వేడుకల్లో పాల్గొన్న ధాత్రీనాథ్‌గౌడ్

**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:**
హాఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ప్రకాష్ నగర్‌లో సగర సంఘం ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాఫీజ్‌పేట్ యువనాయకులు, సామాజ సేవకులు ధాత్రీనాథ్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగీరథ మహర్షి చేసిన సేవలను స్మరించుకుంటూ, సమాజ అభివృద్ధికి ఆయన చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. సమాజంలో సేవాభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో హాఫీజ్‌పేట్ సగర సంఘం అధ్యక్షులు దిండి శ్రీనివాసులు సాగర్, ప్రధాన కార్యదర్శి బీసం చిన్నరాయుడు సాగర్, కోశాధికారి బీసం శేఖర్ సాగర్, గ్రేటర్ యువజన సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ గుంటి వినోద్ సగర, గౌరవ అధ్యక్షులు గుంటి లక్ష్మీనారాయణ సగర, మోడల గోవర్ధన్, చిలక వెంకట రాములు, ఆస్కానీ సాయిబాబా, గుంటి రాములు, చిలక ఆంజనేయులు, బీసం రంగయ్య, కార్యవర్గ సభ్యులు మొగిలి శివసాగర్, చెంచేటి ఆంజనేయులు, మొగిలి రాఘవేంద్ర, చిలుక చంద్రశేఖర్, గుంటి విజయ్, బిజినేపల్లి శ్రీనివాస్, చిలుక మారుతి, కొండికంటి నరేష్, తుమ్మల రాజు, బీసం రాఘవేంద్ర, మోడల ప్రదీప్, సంఘం మహిళా ప్రతినిధులు హాజరయ్యారు.

## వాసవి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించడం శుభపరిణామం : కౌటికే విఠల్

**చిక్కడపల్లి ఏప్రిల్ 23 ( ప్రభాతవార్త ) :** ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం, అహింసా మూర్తి శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి మాత జయంతిని (ఆత్మార్పణ దినాన్ని) తెలంగాణ రాష్ట్ర అధికారిక పండుగగా గుర్తిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ సలహాదారు కౌటికే విఠల్ సంతోషం వ్యక్తం చేసారు. గురువారం చిక్కడపల్లి ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగిన శ్రీ వాసవీ మహాశక్తి మహోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్యవైశ్యుల కోరిక మేరకు ఈ నిర్ణయాన్ని వెల్లడించడం ఆ దిశలో ప్రభుత్వం జీవో విడుదల చేయడమా పట్ల ఆయన ధన్యవాదాలు తెలిపారు.సమాజ సేవలో, ధర్మ ప్రచారంలో ముందుండే ఆర్యవైశ్యులకు ఈ నిర్ణయం గర్వకారణమని పేర్కొన్నారు. అహింసా మార్గంలో ధర్మ రక్షణ కోసం ఆత్మార్పణం చేసిన వాసవి మాత చరిత్రను భావితరాలకు అందించడంలో ఈ గుర్తింపు ఎంతగానో దోహదపడుతుందన్నారు.

## గంగపుత్ర-బెస్తలకు న్యాయం చేస్తాం : బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్


బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ ను కలిసి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

**చిక్కడపల్లి ఏప్రిల్ 23 ( ప్రభాతవార్త ) :** తెలంగాణ రాష్ట్రంలో గంగపుత్ర, బెస్త, గూండ్ల కులస్తుల సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేసి వారికి తగిన న్యాయం చేస్తామని రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ హామీ ఇచ్చారు. బీసీ స్థితిగతులపై జరుగుతున్న జనగణనలో ఈ వర్గాల పరిస్థితులను సవివరంగా పరిశీలించి, వారి న్యాయమైన అభ్యర్థనలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చూపిస్తామని తెలిపారు. గురువారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ నాయకత్వంలో గంగపుత్ర, బెస్త, గూండ్ల సంఘాల ప్రతినిధులు బీసీ కమిషన్ కార్యాలయంలో గురువారం నిరంజన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధిక జనాభా ఉన్న ఈ వర్గాల సంఖ్యను తక్కువగా చూపించడం బాధాకరమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అగ్నికుల క్షత్రియ ఉపకులాల జాబితాలో గంగపుత్ర–బెస్తలను చేర్చడం సరైనది కాదని ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సంప్రదాయంగా చేపల వృత్తి నిర్వహిస్తున్న ఈ వర్గాలకు ఖడ్గం–తల్వార్ గుర్తు కేటాయించడం అనుచితమని, ముదిరాజులకు చాప గుర్తు ఇవ్వడాన్ని కూడా వారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, ఆర్. బాలలక్ష్మి, గంగపుత్ర సంఘాల నాయకులు ఆర్.కె. ప్రసాద్, ప్రొఫెసర్ సుదర్శన్, డి టి రామచందర్, రమ, న్యాయవాదులు మల్లేశం, విశ్వేశ్వరయ్య, నాయకులు ముఠా నరేష్, చేరక సత్యనారాయణ, ముఠా నరేష్, కాయా హనుమంతు, సురేష్ ఆనంద్, సుధాకర్, అడ్వకేట్ విశ్వేశ్వరయ్య, సానా మల్లేష్, ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

## మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

**జగద్గిరిగుట్ట, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**
ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేస్తామని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. గురువారం 126 జగద్గిరిగుట్ట డివిజన్ వాంబే హౌస్ కాలనీలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని భూగర్భ డ్రైనేజీ, త్రాగునీటి సరఫరా సామర్థ్యాన్ని పెంపొందించడంతోపాటు నూతన వీధి దీపాలు ఏర్పాటుచేసి అంతర్గత సిసి రోడ్లను నిర్మించాలని స్థానికులు ఎమ్మెల్యేకి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాంబే హౌస్ కాలనీలో ఇప్పటికే అన్ని రకాల మౌలిక వసతులు కల్పించామని ప్రస్తుత పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. రానున్న రోజుల్లో బాంబే హౌస్ కాలనీలో మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాంబే హౌస్ కాలనీ అధ్యక్షులు మురళి, ప్రధాన కార్యదర్శి, మౌనిక, మాజీ కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్రా అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు బాబు గౌడ్, పాపులు గౌడ్, విటల్, దాసు, మల్లేష్ గౌడ్, శశిధర్ ముదిరాజ్, ప్రభాకర్, మెట్ల శీను, సాయి తేజ, గోపాల్, మహేందర్, నాని, ముంతాజ్, అంజి, భూపతి రెడ్డి, త్రివేణి, తదితరులు పాల్గొన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద

**స్వామివారి కృపా కటాక్షాలు భక్తులందరిపైఉండాలి : ఎమ్మెల్యే**
కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి కృపా కటాక్షాలు భక్తులందరిపై సంపూర్ణంగా ఉండాలని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. గురువారం 127 రంగారెడ్డినగర్ డివిజన్ ఆదర్శ నగర్‌లోని శ్రీశ్రీశ్రీ అలర్మేల్ మంగా పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం 28వ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఎర్వ శంకరయ్య, నాయకులు చంద్రశేఖర్, నాగభూషణం, రవికుమార్, ఎర్వ సాయికిరణ్ (బంటి), శ్రీను, శివలాల్, జల్దా లక్ష్మీనాథ్, ఓంకార్ రెడ్డి, క్రాంతి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత స్థానానికి తీసుకెళ్లేది చదువు

- మణికొండ మాజీ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి


మణికొండ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను పంపిణీ చేస్తున్న మాజీ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి.

**నార్సింగి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :** ప్రతిభ ఏ ఒక్కరి సొత్తు కాదని, ఇష్టపడి చదువుకుంటే మనం ఉన్న స్థానం నుంచి ఉన్నత స్థానాన్ని అధిరోహిస్తామని మణికొండ మాజీ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం మణికొండ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను పంపిణీ చేశారు. ఈ వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు చక్కటి మార్గదర్శనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదల బిడ్డలే చదువుతున్నారని, వీరిలో చదువుపై ఆసక్తి ఉన్నా ఆర్థిక ఇబ్బందుల కారణంగా చాలా మంది మధ్యలోనే చదువులను ఆపివేస్తూ పనుల్లోకి వెళ్తున్నారని తెలిపారు. మట్టిలో మాణిక్యాలున్నట్లే పేదబిడ్డలు సైతం పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించిన వారు చాలా మంది ఉన్నారని తెలిపారు. గత దశాబ్దకాలంగా పదో తరగతిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత పొంది ఆర్థిక స్థోమత లేని చాలా మంది విద్యార్థుల ఉన్నత చదువులకు నావంతు ఆర్థిక సహాయం చేస్తూ వస్తున్నానని తెలిపారు. ఇంటర్, బిటెక్‌లలో విశేషంగా రాణించిన ఆ విద్యార్థులను చూస్తుంటే కలిగే సంతృప్తి అనంతమైందన్నారు. సమాజంలో ఆర్థికంగా స్థిరపడ్డ వారు ముందుకు వచ్చి పేద బిడ్డల ఉన్నత చదువులకు సహకారం అందించాలని రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## హిందూ సమ్మేళనంను విజయవంతం చేద్దాం

- బండ్లగూడ జాగీర్ మాజీ కార్పొరేటర్ బుర్ర సాగర్‌గౌడ్

**నార్సింగి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :** హిందువులలో ఐక్యతను పెంచేందుకు, సంస్కృతి–సదాచారం విస్తరణ కోసం ఈ నెల 26.వ,తేదీన బండ్లగూడ జాగీర్ విజయలక్ష్మీ గణపతి ఆలయంలో నిర్వహిస్తున్న "హిందూ సమ్మేళనం" కార్యక్రమానికి వేలాదిగా తరలి వచ్చి విజయవంతం చేయాలని మాజీ కార్పొరేటర్ బుర్ర సాగర్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం బండ్లగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైందవ శంఖారావానికి హిందూ సోదర,సోదరీమణులు భారీ ఎత్తున తరలి రావాలని సూచించారు. ప్రకృతిని ఆరాధిస్తూ, చెట్టు, పుట్ట,రాయి,రప్ప, పంచభూతాలు ఇలా అన్నింటిని పూజించే హైందవ ధర్మం ఉన్నంత వరకే ధరిత్రిపై శాంతి,సౌభాతృత్వాలు పరిఢవిల్లుతాయని తెలిపారు. రేపటి పౌరులైన నేటి బాలలకు మన సనాతన ధర్మం గొప్పతనంను తెలిపేందుకు హిందూ సమ్మేళనం దోహదపడుతుందన్నారు. ప్రతీ హిందువూ విధిగా మనదైన వేశ,భాష,సదాచారం,సంస్కృతిని పాటిస్తూ బిడ్డలచేత ఆచరింపచేయాలని తెలిపారు. ఈ హిందూ సమ్మేళనంను విజయవంతం చేసేందుకు నావంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానని, హిందూ బంధువులంతా భాగస్వాములు కావాలని సాగర్‌గౌడ్ కోరారు.

## ఎంఐఎం ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ కార్యక్రమం



**అత్తాపూర్ ఏప్రిల్ 23,ప్రభాతవార్త :**
భారత్ ఎన్నికల సంఘం తీసుకొచ్చిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ ఎంఐఎం నాయకులు నిర్వహించారు. గురువారం శాస్త్రీపురండివిజన్ పరిధిలోని సీఎస్ కె కాలనీలో నిర్వహించిన ఎస్ ఐ ఆర్ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ హబీబ్ జాయిన్ ఆరిఫ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఓటర్ జాబితాలో సవరణ దరఖాస్తులు పూర్తిచేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఐఎం కౌన్సిలర్ మహ్మద్ షరీఫ్, నాయకులు అంజద్ ఖాన్, మహమ్మద్ అర్బజ్, మహమ్మద్ సోయల్, మహమ్మద్ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ నూనెలతో ఉల్లిపాయ వేపుడు సరఫరా

-కంపెనీ సీజ్



**కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** హోటళ్లలో ఉపయోగించి పారబోసే కల్తీ నూనెలతో ఉల్లిపాయలు వేయించి బిర్యానీ సెంటర్లకు సరఫరా చేస్తున్న ఓ సంస్థను ఎస్‌ఓటి పోలీసులు సీజ్ చేశారు.కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కైతాపూర్ ప్రాంతంలో బిరిస్తా ఫ్రైడ్ ఆనియన్స్ పేరుతో నడుస్తున్న యూనిట్‌లో హోటళ్ల నుంచి సేకరించిన వాడిన నూనెతో ఉల్లిపాయ వేపుడు తయారు చేసి బిర్యానీ సెంటర్లకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు.ఫుడ్ ఇన్స్‌పెక్టర్‌తో కలిసి నిర్వహించిన ఈ దాడిలో యజమాని యూసుఫ్, సహచరుడు రిజ్వాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఘటన స్థలంలో నుంచి సుమారు 460 లీటర్ల వాడిన నూనె, ఉల్లిపాయ వేపుడు, ఆటో వాహనంతో కలిపి సుమారు రూ.2.61 లక్షల విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

## దోపిడి కేసులో మరొకరి అరెస్ట్.

**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 23, ప్రభాతవార్తః**
జూబ్లీహిల్స్‌లో నమోదైన ఒక దోపిడి కేసులో మరో నిందితుడిని గురువారం క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. డిఐ సత్యనారాయణ కథనం ప్రకారం.. ఈ నెల 9న తెల్లవారుజామున ర్యాపిడో డ్రైవర్ శుభాంకర్ కుమార్(24) యూసుఫ్‌గూడ నుంచి కెబీఆర్ ఉద్యానవనం వైపు వెళ్తున్న క్రమంలో అన్నపూర్ణ స్టూడియో వద్ద అయిదుగురు అగంతకులు అతన్ని అడ్డగించి దాడి చేసి దోపిడికి పాల్పడ్డారు. ఈ కేసులో ఇప్పటికే రేసు ప్రణీత్‌రెడ్డి(19), బర్ల పవన్ కళ్యాణ్(20)ను అరెస్ట్ చేశారు. కాగా ఈ కేసులో మరో నిందితుడిగా ఉన్న ఈశ్వర్‌గౌడ్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మరో ఇద్దరు నిందితుల కోసం గాలిస్తున్నామన్నారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం

**సంజీవరెడ్డి నగర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
ఎస్సార్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనుగొనబడింది. ఇన్స్‌పెక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, 17-04-2026 తేదీన బల్కంపేట దేవాలయం వద్ద సుమారు 40-45 సంవత్సరాల వయస్సు గల ఒక పురుష మృతదేహం కనిపించింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు.

## ద్విచక్ర వాహనాలను తస్కరిస్తున్న ముఠా అరెస్టు

**చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** ద్విచక్ర వాహనాలను దొంగలిస్తున్న ఐదుగురు మైనర్లను బండ్లగూడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి జువైనల్ జస్టిస్ బోర్డు ముందు హాజరు పరిచారు. ఇన్‌స్పెక్టర్ ఆర్.దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం... బండ్లగూడ మహ్మద్‌నగర్ నివాసి రాషెద్ బిన్ అహ్మద్ షిబ్లి అనే వ్యక్తి ఈనెల 10వ తేదీ రాత్రి ఇంటి ముందు నిలిపిన బజాజ్ పల్సర్ మాయమైనట్లు ఈనెల 13న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో గురువారం బండ్లగూడ చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు అనుమానాస్పదస్థితిలో వస్తున్న ఒక ద్విచక్ర వాహనం తారసపడింది. ఆ వాహనంపై ప్రయాణిస్తున్న వ్యక్తిని ఆపి విచారించగా అతను తిరుగుతున్న వాహనం దొంగలించినదని తేలింది. లోతుగా చేపట్టిన విచారణలో షాహీన్‌నగర్‌కు చెందిన వారి మరో నలుగురిని అరెస్టు చేశారు. ఐదుగురు స్నేహితులందరూ ఒక ముఠాగా ఏర్పడ్డారు. గంజాయికి, మత్తు పదార్థాలకు బానిసలై, సులభంగా డబ్బు సంపాదించాలన్న దురాశతో ద్విచక్ర వాహనాలను తస్కరిస్తున్నారు. వీరు బండ్లగూడ పిఎస్ పరిధిలో బజాజ్ పల్సర్, కూకట్‌పల్లి పీఎస్ పరిధిలో యమహా, కర్ణాకట బీదర్ నుండి సుజికిలు ఎత్తుకుపోయారు. పోలీసులు వీటిని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం విలువ సుమారు రూ.5లక్షలుంటుంది. ముఠాపై డిఐ ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి బాల నేరస్థుల న్యాయస్థానంలో హాజరు పరిచారు. కేసు దర్యాప్తులో ఉంది.

## ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పుస్తక దినోత్సవం




ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన ప్రపంచ పుస్తక దినోత్సవంలో ప్రసంగిస్తున్న ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ తదితరులు

**ఉప్పల్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ పుస్తక దినోత్సవం (ప్రపంచ కాపీ హక్కుల దినోత్సవం) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని సభాధ్యక్షులు డా.కె. విజయ్ కుమార్ ప్రారంభించగా తెలుగు సహాయాచార్యు జె.విశ్వనాద్ కుమార్ సమన్వయం చేశారు. ప్రముఖ స్త్రీవాద కదజా రచయిత్రి, కవయిత్రి, వ్యాసకర్త, కాలమిస్ట్, సామాజిక కార్యకర్త, హస్మిత ప్రచురణకర్త, సంపాదకురాలు, విశ్రాంత గ్రంథజపాలకురాలు బండారు విజయ ముఖ్య అతిదిజగా విచ్చేసారు. గ్రంథజపఠన ఆవశ్యకతని గురించి విస్తృత ఉపన్యాసం చేశారు. పుస్తకాలే విద్యార్థులకు నేస్తాలు, సమస్తాలు కావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు కదజారచన చేస్తే హస్మిత ప్రచురణలు పుస్తకంగా తీసుకొని వస్తుందని తెలిపారు. మరో అతిథి బాలసేవారత్న, కాంతి ఫౌండేషన్ స్థాపకులు కందుకూరి రాము ఖిమరో గ్రంథజాలయ ఉద్యమ పోస్టర్లు ప్రదర్శించారు. విద్యార్థులను ఉత్తేజితం చేసి గ్రంథజాలయ ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకుని వెళ్ళాలని కోరారు. ఈ సందర్భంగా జరిగిన నాకు ప్రేరణనిచ్చిన పుస్తకం అనే భావాంశం ఆధారంగా జరిగిన వ్యాసరచన పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు వాసంతి, మనీష, మల్లీశ్వరి, అమృతజ్యోతి, అశోక్, నిదా ఫాతిమాలు బహుమతులు సాధించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.సిహెచ్ సత్యనారాయణ, గ్రంథజపాలకులు డా.ఆర్.చంద్రసాగర్, డా.జి.తిరుపతయ్య, పి.విజయ్ కుమార్, డా.రాజశ్రీ, డా.ఎస్ యమునారాణి, కె.గీత, డా.వి.శ్రీనివాసరావు, డా.పి.వెంకటేశ్వర్లు, స్రవంతి, అనూరాధ, అనూష తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమం కోసం కృషి : అధ్యక్షుడు వెంకటరమణ



చేగురి వెంకటరమణ ను సన్మానిస్తున్న మాజీ డైరెక్టర్ మైల రవికాంత్, ఆంజనేయులు, వెంకటేష్ తదితరులు

**మలక్ పేట, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
రైతులకు మంచి ధరను అందించడంతోపాటు వారి సంక్షేమం కోసం కృషి చేస్తామని తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షుడు, ఆనియన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ ప్రముఖ వ్యాపారవేత్త చేకూరి వెంకటరమణ పేర్కొన్నారు. మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్లో జరిగిన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మైల రవికాంత్ ఆంజనేయులు వెంకటేష్ తదితరులు చేగురి వెంకటరమణ కు పుష్ప గుచ్ఛాలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్టుకు తాము పండించే సరుకులను తీసుకొచ్చే రైతులకు తాము అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించి వారికి మంచి ధర లభించేలా కృషి చేస్తున్నమని పేర్కొన్నారు. రైతులకు, వ్యాపారస్తులకు ఎల్లవేళల అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మార్కెట్ ను అన్ని విధాలుగా అభివృద్ధి పరచడంలో తమ వంతు తోడ్పాటును అందిస్తున్నామని పేర్కొన్నారు. రైతులు బాగుంటే అందరూ బాగుంటారని, రైతుల సంక్షేమమే తమ ధ్యేయమని తెలిపారు. మార్కెట్లను ఆధునీకరించడంలో తమ వంతు సహాయ, సహకారాలను అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలి : మధుసూదన్ రెడ్డి



కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బిజెపి నాయకులు బొక్క మధుసుదన్ రెడ్డి, అనుముల భరత్, రమణ్ సింగ్ తదితరులు

**మలక్ పేట, ఏప్రిల్ 23,ప్రభాతవార్త:**
ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఉగ్రవాది అని ఒక దేశద్రోహి లాగా మాట్లాడాన్ని తీవ్రంగా ఖండిస్తూన్నమని బిజెపి భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొక్క మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బిజెపి నాయకులు, కార్యకర్తలు మూసారాంబాగ్ చౌరస్తా వద్ద మల్లిఖార్జున ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బొక్క మధుసూదన రెడ్డి మాట్లాడుతూఅనునిత్యం దేశ ప్రగతి కోసం పాటుపడుతున్న భారత ప్రధాన మంత్రి పై ఖర్గే చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకుని, దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తుందని పేర్కొన్నారు. దేశ ప్రధానిపై ఇటువంటి వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గౌర దేవేందర్ ,కొప్పుల దినేష్ , అనుముల భరత్ ,కొంగర ప్రవీణ్ ,రంజిత్,రాజు ముదిరాజ్,పరశురాం, హరి,తులసి,వెంకటేష్, మనోజ్,తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ వైర్లు తగలడంతో బాలుడికి తీవ్రగాయాలు




విద్యుత్ షాక్ కు గురైన బాలుడిని పరామర్శిస్తున్న ఎంఐఎం డివిజన్ అధ్యక్షుడు సైపుద్దిన్ షఫీ తదితరులు

**మలక్ పేట, ఏప్రిల్ 23,ప్రభాతవార్త:**
విద్యుత్ వైర్లు తగలడంతో ఓ బాలుడు తీవ్ర గాయాలకు గురైన సంఘటన ఓల్డ్ మలక్ పేటలో జరిగింది. ఓల్డ్ మలక్ పేట్ డివిజన్ హౌజింగ్ బోర్డు కాలనీ కి చెందిన జగదీష్ నానాజీ కుమారుడు కౌశిక్ నానాజీ (12) బుధవారం సాయంత్రం కాలని రోడ్డుపై క్రికెట్ ఆడుతుండగా బాల్ ఎగిరి కంచలేని ట్రాన్స్ ఫార్మర్ వద్ద పడింది. దీంతో బాల్ తెచ్చుకునేందుకు వెళ్లగా వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగలడంతో కౌశిక్ చేయి, ముఖానికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే మలక్ పేట్ యశోద ఆసుపత్రికి చికిత్స నిమిత్తం బాలుడు కౌశిక్ నానాజీని తరలించారు. సమాచారం తెలియడంతో మలక్ పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల, ఓల్డ్ మలక్ పేట్ డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు సైపుద్దిన్ షఫీ లు స్పందించి బాలుడికి వైద్యం అందేలా చేశారు. సైపుద్దీన్ షఫీ ఆసుపత్రికి వెళ్లి బాలుడిని పరామర్శించి బాలుడి కి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని ఆస్పత్రి వర్గాలకు సూచించారు.

# ఉప్పల్ సర్కిల్‌కు దిక్కేవరు..ఖాళీగా ప్రధాన పోస్టులు

### -తూతూమంత్రంగా విధులు : పట్టించుకోని పాలకులు




ఉప్పల్ సర్కిల్ కార్యాలయం ( ఫైల్ ఫోటో)

**ఉప్పల్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఉప్పల్ జోన్ పరిధిలోని వివిధ ప్రధాన విభాగాల అధికారుల పోస్టులు ఖాళీగా ఉండడంతో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. ఉప్పల్ కమిషనర్, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాల అధికారుల పోస్టుల ఖాళీగా ఉన్నాయి. ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ గత నెల రోజుల క్రితం సెలవుపై వెళ్లారు. అప్పటి నుంచి బోడుప్పల్ కమిషనర్ ఇంచార్జీగా కొనసాగుతున్నారు. అయితే ఇప్పటి వరకు ఆమెకు కీ ఇవ్వకపోవడంతో నామమాత్రంగా విధులు సాగిస్తున్నారు. ఉప్పల్. ఇంచార్జీ కమిషనర్ హయాంలో పరిపాలన వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇంటి నిర్మాణ అనుమతులు, రెవిన్యూ, ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించిన అసెస్‌మెంట్‌లు, రివిజన్ ఫైళ్లు, ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల వంటి సమస్యల పరిష్కారం కోసం నెలల తరబడి ఫైళ్లు కదలకుండా ఉండిపోవడం ప్రజ లను తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. రెవిన్యూ విభాగంలో కొందరు టాక్స్ ఇన్స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు తమ సొంత ఆదాయం కోసం మాత్రమే పని చేస్తున్నారే తప్ప పేద, సామాన్య ప్రజల కోసం చేయ కుండా కాలయాపన చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సెలవులో ఉండడంతో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. అనుమ తుల కోసం దరఖాస్తు చేసిన ఫైళ్లు కార్యాలయాల్లో పేరుకు పోయి, పనులు నిలిచిపోవడంతో నిర్మాణదారులు, సాధారణ ప్రజలు ఆందో ళన చెందుతున్నారు. ఎలాంటి విచారణ చేయకుండానే ఫైళ్లను రిజెక్ట్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనుల కోసం కార్యాలయాలకు వెళ్లిన ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండడం లేదు. కార్యాలయాల్లో ఎదురుచూసినా సంబంధిత అధికారులు కనిపించకపోవడం, ఫోన్ చేసినా స్పందించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

### ప్రధాన పోస్టులు ఖాళీ :

ఉప్పల్ డిప్యూటీ కమిషనర్‌తోపాటు, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాలకు చెందిన ప్రధాన అధికారులు సెలవులో ఉన్నారు. కొందరు వ్యక్తిగత పనులతో సెలవు తీసుకుంటే, మరికొందరు అధికారుల నుంచి తప్పించుకునేందుకు సెలవు పెట్టి వెళ్లిపోయినట్లు విమర్శలు ఉన్నాయి. దీనిపై పాలకుల పనితీరుపై సైతం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సర్కిల్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై నిఘా పెట్టి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## లైన్స్ క్లబ్ సేవలు గ్రామాలకు విస్తరించడం పేద విద్యార్థులకు ఎంతో దోహదం




టాయిలెట్ కాంప్లెక్స్‌ను ప్రారంభించిన గవర్నర్ ఇన్నారెడ్డి అడిషనల్ డీసీపీ వెంకటరమణ, మాజీ గవర్నర్ , ఎండి 320 ఎల్సిఐఎఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ లయన్ హరీష్ రెడ్డి దృశ్యం...

**కుషాయిగూడ, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**
లైన్స్ క్లబ్ సేవలు గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల రూపకల్పనకు చేయూతనందించడం నిరుపేద విద్యార్థులకు ఎంతో దోహదపడుతుందని మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ఉప్పల్ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ పోలీస్ ఎన్ వెంకటరమణ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర నల్గొండ జిల్లా వల్లాల గ్రామంలో లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ 320 సి, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ గోల్డెన్ జూబ్లీ సహకారంతో నిర్మించిన బాత్రూమ్స్ కాంప్లెక్స్ ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో తగిన వసతులు లేక విద్యార్థిని విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నగరంలోనే కాకుండా గ్రామంలో సైతం లక్షలాది రూపాయలు వెచ్చించి విద్యార్థినీ విద్యార్థులకు బాత్రూముల కాంప్లెక్స్ ను నిర్మించిన లైన్స్ క్లబ్ సేవలను వల్లాల గ్రామ జెడ్పిహెచ్‌ఎస్ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థి , ఉప్పల్ అడిషనల్ డీసీపీ ఎన్ వెంకటరమణ కొనియాడారు. ఇలాంటి బృహత్కర కార్యక్రమానికి సహకరించిన మాజీ గవర్నర్, ప్రముఖ పారిశ్రామికవేత్త, సేవ తత్పరులు , ఎండి 320 ఎల్ సి ఐ ఎఫ్ కోఆర్డినేటర్ లయన్ డాక్టర్ కె.హరీష్ రెడ్డి, డిస్టిక్ గవర్నర్ ప్రముఖ సంఘ సేవకులు, పలు విద్యాసంస్థల అధినేత లయన్ .ఇన్నారెడ్డి, ఫస్ట్ వైస్ డిస్టిక్ గవర్నర్ ప్రముఖ పారిశ్రామికవేత్త లయన్ డాక్టర్ మండా సురేష్ సేవలను గ్రామవాసులంతా ప్రశంసించారు. గ్రామాలలో సేవలు చేయడంలో ఉన్న తృప్తి వర్ణించలేమని డిస్టిక్ గవర్నర్ ఇన్నారెడ్డి మాజీ గవర్నర్, ఎండి 320 ఎల్ సి ఐ ఎఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె హరీష్ రెడ్డి లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శాలిగౌరారం గార్లపాటి జ్యోతిలక్ష్మి, ఎంఈఓ మందుల సైదులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాచుపల్లి మధు ఉప ప్రధానోపాధ్యాయులు చింతల నరసింహులు డిస్టిక్ సెక్రెటరీ లయన్ డాక్టర్ కిరణ్ ఆర్కిటెక్టిలమేఘన,క్లబ్ అధ్యక్షులు లక్ష్మీనరసింహారాజు ,కార్యదర్శి అనంత్ ,కోశాధికారి మోహన్, కుమార్, వల్లాల గ్రామ సర్పంచ్ తిరుపతమ్మ ఉపేందర్ గౌడ్, ఉప సర్పంచ్ రాగి దావీద్ తదితరులు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్‌లో భారీ అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించండి

### -సిఎం రేవంత్‌రెడ్డికి బిఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనాయకురాలు సబితారెడ్డి విజ్ఞప్తి




బడంగ్‌పేట్ కార్యాలయం

**సరూర్‌నగర్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** ప్రస్తుత జిహెచ్ఎంసిలో విలీనమై కొత్తగా ఏర్పడిన బడంగ్‌పేట్ సర్కిల్ పరిధి కిందకు వచ్చిన గత బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగిన భారీ అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని స్థానిక మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి, శాసనసభలో బిఆర్ఎస్ పక్ష ఉప నాయకురాలు పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సిఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖను గురువారం తన పిఏచే సచివాలయంలోని సిఎంఓ కార్యాలయంలో అందజేయించి దానికి సంబంధించిన ప్రతులను విడుదల చేయించారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగిన నిధుల దుర్వినియోగానికి, అవినీతి అక్రమాలకు పాల్పడిన పది మంది అధికారులను సస్పెండ్ చేయడాన్ని హృదయపూర్వకంగా స్వాగిస్తున్నట్లు ఆమె లేఖలో పేర్కొన్నారు. అయితే అవినీతి అక్రమాలకు సంబంధించి వెలుగులోకి వచ్చిన ప్రాథమిక విచారణ అంశాలను పరిశీలిస్తే ఇది కేవలం మంచు కొండ కొన మాదిరి మాత్రమేనని స్పష్టమవుతుందని అన్నారు. ఇక్కడ సాగిన వ్యవస్థీకృత అవినీతిని కూకటివేళ్ళతో సహా పెకిలించాలంటే మరింత లోతైన విచారణ అవసరమని భావిస్తూ దీనిపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. కేవలం అధికారులను మాత్రమే సస్పెండ్ చేస్తే సరిపోదనీ వారి వెనుక ఉండి భారీ అవినీతి అక్రమాలను ప్రోత్సహించి అందులో లబ్ది పొందిన అదృశ్య శక్తులను గుర్తించి విచారణ పరిధిలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. బడంగ్‌పేట్‌లో అవినీతి అక్రమాలపై విజిలెన్స్, ఎసిబి విచారణ జరిగిన క్రమంలో కార్యాలయంలో ఉండాల్సిన కీలక ఫైళ్ళను ఉద్దేశ్యపూర్వకంగా మాయం చేసిన సూత్రధారులను గుర్తించి వారిపై కఠినమైన క్రిమినల్ కేసులను నమోదు చేయించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అవినీతి అక్రమాల్లో భాగంగా ప్రభుత్వ నిధులను ప్రైవేటు వెంచర్లకు మళ్ళించి వాటిల్లో చేసిన పనులకు సంబంధించి ఖర్చు చేసిన నిధులను రికవరీ చేయించాలనీ అదే విధంగా బాధ్యులైన వెంచర్ యజమానులపై కేసులు నమోదు చేయించాలని ఆమె కోరారు. అభివృద్ధి పనులు పూర్తి చేయకుండానే అక్రమాలకు పాల్పడి బిల్లులు పొందిన కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో చేర్చి వారి నుండి డబ్బులను రికవరీ చేయించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. బడంగ్‌పేట్ నగర పంచాయతీ ఆవిర్భవించిన నాటి నుండి కార్పొరేషన్‌గా మారిన కాలం వరకు గ్రామాల్లో మాజీ సర్పంచ్‌ల తీర్మానాల పేరిట అడ్డగోలుగా చేసిన అక్రమ లేఔట్లపై కూడా విచారణ జరిపాలనీ అదే విధంగా ఎల్ఆర్ఎస్ కట్టించుకున్న వాటిపై కూడా దర్యాప్తు చేయించాలని సబితా ఇంద్రారెడ్డి కోరారు. ముఖ్యంగా బరితెగింపు ధోరణితో జరిగిన అక్రమ భవన నిర్మాణ అనుమతులపై నిబంధనలకు విరుద్ధంగా ఒకే ప్లాట్‌పై ఏకంగా పది వరకు ఇంటి నిర్మాణ అనుమతులు మంజూరు చేసిన వారి పాత్రపై విచారణ జరిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో ఎఫ్‌టిఎల్ ఆక్రమణలు, చెరువులు, కుంటల బఫర్ జోన్లు, నాళాల కబ్జాలు చేసి అక్రమ వెంచర్లు చేసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకొని నాళాలను పునరుద్ధరించాలని ఆమె కోరారు. ప్రజా ధనాన్ని కొల్లగొట్టి వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేసిన వారిపై తక్షణమే ప్రత్యేక విచారణ జరిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగిన అక్రమాలన్నింటిపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇక్కడ జరిగిన అవినీతి అక్రమాలపై ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపించడం ద్వారా ప్రజలకు న్యాయం చేసినట్లు అవుతుందని ఆమె పేర్కొన్నారు.

## కెసిఆర్‌కు ఊరటనిచ్చే హైకోర్టు తీర్పు ప్రత్యర్థులకు చెంపపెట్టు: సబితా ఇంద్రారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** తెలంగాణలో రైతాంగ ప్రయోజనాల కోసం, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పరితపించి పని చేసిన కెసిఆర్‌పై రాజకీయ ప్రతీకారేచ్ఛతో అధికార మదంతో పెట్టిన కేసులకు సంబంధించి హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రత్యర్థులకు గట్టి హెచ్చరిక అని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే, బిఆర్ఎస్ శాసనసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. గురువారం జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డులోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో కెసిఆర్‌కు ఊరటనిస్తూ హైకోర్టు తీర్పునివ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె హైకోర్టుకు ధన్యవాదాలు తెలిపారు. అధికార మదంతో ప్రభుత్వాలు రాజకీయ ప్రతీకారంతో పెట్టే కేసులకు ఈ తీర్పు చెంపపెట్టులాంటిదని ఆమె వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో కెసిఆర్ ఎలాంటి తప్పు చేయలేదనేది స్పష్టమైందని ఆమె అన్నారు. తెలంగాణ ప్రజలు కెసిఆర్ ఏ విధమైన తప్పు చేయలేదని ఏనాడో అర్థం చేసుకున్నారని ఆమె తెలిపారు. ప్రత్యర్థి పార్టీలు, ప్రభుత్వాలు కెసిఆర్‌పై ఎన్ని ఆరోపణలు చేసినా విమర్శలు చేసినా ఆయన మాత్రం తెలంగాణ ప్రయోజనాల కోసమే పని చేసే నాయకుడని అందరికీ తెలుసని ఆమె అన్నారు. ముఖ్యంగా రైతాంగం కోసం ఆయన చూపిన శ్రద్ధ ప్రత్యేకమని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం కెసిఆర్‌పై కక్షపూరిత ధోరణిని వీడి కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో దెబ్బతిన్న భాగాలకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని ఆమె సూచించారు. చెరువులు, కాలువలను ఈ ప్రాజెక్ట్ ద్వారా నింపి రైతాంతగానికి సాగు నీటిని ఇవ్వాలని అన్నారు. మిషన్ భగీరథపై దృష్టి పెట్టి ప్రజలకు తాగు నీటి సమస్యలను తీర్చాలని ఆమె తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, రైతాంగం, ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉండే కెసిఆర్‌కు తాము అండగా ఉంటామని సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ బిఆర్ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, బడంగ్‌పేట్ సీనియర్ మాజీ ప్రజాప్రతినిధి పెద్దబావి ఆనంద్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

## నేరేడ్‌మెట్‌లో వివాహిత ఇద్దరు పిల్లలతో అదృశ్యం

**నేరేడ్ మెట్ , ఏప్రిల్ 23,ప్రభాతవార్త :** నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివాహిత తన ఇద్దరు చిన్నారులతో కలిసి అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. సబ్ ఇన్స్పెక్టర్ లక్ష్మి ప్రసన్న తెలిపిన వివరాల ప్రకారం.. శక్తినగర్‌కు చెందిన కె. అంజు (28) ఈ నెల 21వ తేదీ ఉదయం సుమారు 7.30 గంటలకు తన ఇద్దరు పిల్లలు దత్తా (2), తేజశ్రీ (2)తో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. సాయంత్రం వరకు ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై బంధువులు, పరిచయస్తుల వద్ద వెతికినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. దీంతో భర్త కె. చందు ఫిర్యాదు మేరకు నేరేడ్‌మెట్ పోలీసులు కేసు నమో దు చేసి దర్యాప్తు చేపట్టారు.అంజు ఎత్తు సుమారు 5 అడుగులు ఉండగా, బయటకు వెళ్లినప్పుడు పంజాబీ డ్రెస్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఆమెకు తెలుగు, ఒడియా, నేపాలీ, హిందీ భాషలు తెలుసునని పేర్కొన్నారు.అదృశ్యమైన మహిళ, చిన్నారుల ఆచూకీ గురించి సమాచారం తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## 26న వాసవి కన్యనా పరమేశ్వరి జయంతి ఉత్సవాలు



ఎంపి ఈటల రాజేందర్ సతీమణి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఉప్పల్ ఆర్య వైశ్య సంఘం నేతలు

**ఉప్పల్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :** ఉప్పల్‌లో శ్రీ కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలు ఈనెల 26న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి నేతలు తెలిపారు. ఈ మేరకు గురువారం శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయం ట్రస్ట్ చైర్మన్ బిక్కుమళ్ల రమేష్ గుప్తా, ఉప్పల్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బిక్కుమళ్ల సుధాకర్ గుప్తా ఆధ్వర్యంలో పలువురు నేతలు మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ సతీమణిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నదానం తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు మార్నేని పణీందర్, ప్రధాన కార్యదర్శి తీగ విఠల్‌రావు, ఆలయ ట్రస్ట్ చైర్మన్ రమేష్ గుప్తా, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బిక్కుమళ్ల సుధాకర్ గుప్తా, ఉపాధ్యక్షులు రేణిగుంట కిరణ్ కుమార్ గుప్తా, పాలడుగు సంపత్, రాకేష్ గుప్తా, ప్రవీణ్ గుప్తా పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా కల్పవృక్ష వాహనసేవ



స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న చంద్రశేఖర్‌గుప్తా, శ్రవణ్‌కుమార్

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** స్వామి వారి కల్పవృక్ష వాహనసేవ వందలాదిమంది భక్తుల కోలాహలం మధ్య ఘనంగా నిర్వహించారు. ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీలోని అష్టలక్ష్మి దేవాలయం 30వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఉదయం కల్పవృక్ష వాహనసేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా సుప్రభాతసేవ, బాలభోగ మంగళ శాసనము, సుదర్శనఇష్టి, యాగశాలలో పూర్ణాహుతి, ప్రధాన యాగశాలలో బలిహరణము, మహాపూర్ణాహుతి, చక్రతీర్థోత్సవము, శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం, దేవత ద్వాసన, శ్రీపుష్పయాగము, సప్త వరణ, ద్వాదశరాధన, మంగళశాసనము తదితర కార్యక్రమాలను వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణ మధ్య భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం ప్రతినిధులు శ్రవణ్‌కుమార్, మ్యాడం సుధాకర్‌గుప్తా, బంధం దామోదర్, దాచేపల్లి శ్రీనివాస్, బోయిని శ్రీనివాస్, చిలుక ఉపేందర్‌రెడ్డి, కొక్కొండ చంద్రశేఖర్, మాలే శ్రీనివాస్‌గుప్తా, సత్యనారాయణ, మాలే శ్రవణ్ కుమార్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ నేతల ప్రత్యేక పూజలు



కేక్‌కట్ చేస్తున్న గణేష్‌నేత తదితరులు

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి 70వ జన్మదినాన్ని పురస్కరించుకొని శ్రీరామకృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత ఆధ్వర్యంలో శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో కేఎల్ఆర్ పేరు మీద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలక ఉపేందర్‌రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధు, శ్రీప్రసన్నఆంజనేయస్వామి దేవాలయం చైర్మన్ తలాటి రమేష్‌నేత, శ్రీఖిల్లామైసమ్మ దేవాలయం చైర్మన్ సురేష్ కుమార్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు గట్ల రవీంద్ర, మాజీ చైర్మన్ పగిళ్ల భూపాల్‌రెడ్డి, బొడ్డుపల్లి మహేందర్, రామకృష్ణగౌడ్, పెద్దఊర సైదులు, కందుకూరి సుదర్శన్, గుణగంటి రమేష్‌గౌడ్, దొర్నాల చంద్రమౌళి, సందీప్, ఆనంద్‌కుమార్, వెంకటేష్‌గుప్తా, కృష్ణారావు, పొట్టబత్తిని నగేష్, చిలక రాజు, సాయికుమార్, సంగం రమేష్, శ్రవణ్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, రామారావు, వెంకట్‌రెడ్డి, రాములుగౌడ్, శివలింగం, మోహన్ రెడ్డి, బాలరాజు, అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, నరసింహారెడ్డి, మూర్తి, జెల్లా జగన్నాథం, మల్లేష్‌యాదవ్, రేణుక, రమాదేవి, స్వరూప, మాధవి, జహంగీర్, విప్లవరెడ్డి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా షిరిడీ సాయి బాబా సంస్థాన్ వార్షికోత్సవ వేడుకలు



శ్రీ షిరిడీ సాయి బాబా సంస్థాన్ వెబ్ సైట్‌ను ప్రారంభిస్తున్న నేలపాటి రామారావు తదితరులు.

**వనస్థలిపురం. ఏప్రిల్.23.ప్రభాతవార్త.**
వనస్థలిపురం ప్రశాంత్ నగర్‌లోని శ్రీ షిరిడి సాయి బాబ సంస్థాన్ 27వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా రామోజీ ఫిల్మ్ సిటీ ఎండి విజయేశ్వరి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీ నేలపాటి రామారావు గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ వారు ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ హుండీ సేవలను శ్రీ నేలపాటి రామారావు గారు లాంఛనంగా ప్రారంభించారు. భక్తులకు సులభంగా, పారదర్శకంగా విరాళాలు అందించే విధంగా ఈ సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు ఇలాంటి సాంకేతిక కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ప్రైవేటీకరణను విరామించుకోవాలి



కార్మికులకు మద్దతు తెలుపుతున్న సీపీఐ నాయకులు.

**హయత్ నగర్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :**
రాష్ట్రంలో నీరుపేద ప్రజలకి అందుబాటులో ఉండే ఏకైక రవాణా మార్గం ఆర్టీసీ బస్సని ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఆ బస్సులు రోడ్ల మీదికి రాకపోవటంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ అబ్దుల్లాపూర్ మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ విమర్శించారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకి సీపీఐ అబ్దుల్లాపూర్ మెట్టు మండల సమితి సంపూర్ణ మద్దతు తెలియ జేసింది. బండ్లగూడ బస్ డిపో దగ్గర సమ్మెలో ప్రత్యక్షంగా పాల్గొన్న అయన మాట్లాడుతూ... అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రస్తావించినట్లు కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆర్టీసీని ప్రైవేటు పరం చేయడం వల్ల ఆర్టీసీ కార్మికులతో పాటు సామాన్య జనాలకు కూడా ప్రభుత్వం ద్రోహం చేసినట్లే అవుతుందన్నారు. ప్రభుత్వం దిగివచ్చి కార్మికులతో చర్చలు జరిపి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులకి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. గత ప్రభుత్వ పద్ధతులనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అనుసరిస్తే ప్రజల నుండి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులుకేతరాజు నరసింహ, దాసరి ప్రసాద్, పేరాల గోపి, శోభన్, అశోక్, ఉప్పలయ్య, మల్సూర్ మరియు బండ్లగూడ డిపో కార్మిక జేఏసీ నాయకులు పాపయ్యగౌడ్, ఎస్.రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

## చిన్నారులతో సందడిగా మారుతున్న స్విమ్మింగ్ పూల్స్



స్విమ్మింగ్ చేస్తున్న చిన్నారులు

**సైదాబాద్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** వేసవి సెలవులు మొదలవడంతో చిన్నారులు ఈత కొలనుల బాట పట్టారు. సంవత్సరం మొత్తం చదువులు, పరీక్షలతో ఉక్కిరిబిక్కిరి అయిన చిన్నారులు సెలవుల్లో సేద తీరడానికి ఈత కొలనుల బాట పడుతున్నారు. భగభగ మండుతున్న ఎండలకు ఈత కొలనులు పెద్దలకు, చిన్నారులకు ఉపశమనంగా మారాయి. చిన్నారులతో స్విమ్మింగ్ పూల్స్ కళకళలాడుతున్నాయి. స్విమ్మింగ్ చేస్తున్న సమయంలో తగిన జాగ్రత్తలు తప్పని సరిగా తీసుకోవాలి. కొత్తగా ఈత నేర్చుకునేవారు, ట్యూబ్‌లతో ఈత నేర్చుకునే వారు, ఈతరాని చిన్నారులు, పెద్దలు లోతు ఎక్కువగా ఉండే ప్రాంతం వైపు వెళ్లకూడదు. కళ్లకు అద్దాలు, తలకు కవర్, చెవుల్లోకి నీరు పోకుండా అవసరమైన పరికరాలు ఉపయోగించాలి. కోచ్ పర్యవేక్షణలోనే ఆయన సూచనల మేరకే ఈత నేర్చుకోవాలి. మండే వేసవిలో స్విమ్మింగ్ పూల్‌లో గడపడం చిన్నారులకు, పెద్దలకు ఆహ్లాదం తో పాటు ఆరోగ్యాన్ని కలిగిస్తుందని, అయితే స్విమ్మింగ్ చేసేట ప్పుడు తగిన రక్షణ చర్యలు తప్పని సరిగా తీసుకోవాలని చంపాపేట జెఎస్ఆర్ స్విమ్మింగ్ పూల్ నిర్వాహకులు ఎ.రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు.

## కొబ్బరి కాయకొట్టిన ప్రతి పని పూర్తి చేస్తాం : సాయిజన్ శేఖర్



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్

**నాచారం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :** రూ. 35 లక్షల వ్యయంతో నాచారం రాఘవేంద్ర నగర్ పోచమ్మ గుడి నుండి అన్నపూర్ణ కాలనీకి వెళ్లే మార్గంలో నిర్మిస్తున్న నూతన సిమెంట్ రోడ్డు పనులను గురువారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తూ, ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సాయిజెన్ శేఖర్ మాట్లాడుతూ, కార్పొరేటర్ పదవీకాలం చివర్లో ఎమ్మెల్యే బీఎల్ఆర్ ప్రత్యేక చొరవతో ఆమోదం పొందిన అభివృద్ధి పనులపై కొంతమంది అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు." పనులు శాంక్షన్ కాలేదు" అంటూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అలాంటి ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. బీఆర్ఎస్ హయాంలో ఆమోదం పొందిన రూ.14 కోట్ల విలువైన పనులన్నింటినీ దశలవారీగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విఠల్ యాదవ్, మారయ్య, రాజబాబు, దేవులపల్లి యాదగిరి, నరేందర్ గౌడ్, మన్సూర్, గుజ్జ రాజు, అప్పు, పరశురాం, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బూత్ లెవెల్ ఏజెంట్లే పార్టీకి పునాదులు : మధుయాష్కి గౌడ్



**హయత్ నగర్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :**
బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసినప్పుడే రాష్ట్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ పటిష్టమవుతుందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ అన్నారు. బూత్ లెవెల్ ఏజెంట్ల ఎంపిక ప్రక్రియలో భాగంగా గురువారం ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, ముఖ్య కార్యకర్తల సమావేశ గురువారం హయత్ నగర్ టీ నగర్ లోని క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న ఎస్ఐఆర్ లో ఓట్లు తొలగింపులో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బెంగాల్, తమిళనాడు రాష్ట్రాలలో ఇష్టారీతిన ఓట్ల తొలగింపు ఆరోపణల నేపథ్యంలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త జాగ్రత్త వహించాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు తగిన గుర్తింపు లభించేలా తాను కృషి చేస్తానన్నారు. కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని అధిష్టానానికి పలుమార్లు సూచించినట్లు పేర్కొన్నారు. రోడ్డు డెవలప్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ... బిఎల్‌ఓల నియామకంపై పార్టీ నాయకులు జాగ్రత్త వహించి.. నిబద్ధతతో పనిచేసే వారిని ఎంపిక చేయాలన్నారు. జిహెచ్ఎంసి ఎన్నికలకు ఇది ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. పీసీసీ కోఆర్డినేటర్ వెన్నెల గద్దర్ మాట్లాడుతూ.. అన్ని వర్గాలను సమైక్యం చేయడమే సంఘటన్ శ్రీజన్ ముఖ్య ఉద్దేశమన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, అన్ని వర్గాలకు రక్షణ కల్పిస్తుంద న్నారు. బూత్ ఏజెంట్ల నియామకం తొందరగా పూర్తి చేస్తే పీసీసీకి పంపిస్తామన్నారు.